# మంచి వ్యక్తిత్వానికి పుస్తక పఠనం అవసరం

- బుక్‌ఫెయిర్‌ను సందర్శించిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
-వారాంతం కావటంతో సందర్శకులతో కిటకిట


బుక్‌ఫేర్‌ను సందర్శిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, డిసెంబర్ 21, ప్రభాతవార్త:** మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవటానికి పుస్తక పఠనం ఎంతో అవసరమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియం లో 37వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శనను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటుచేసిన బుక్ స్టాల్స్ వద్దకు వెళ్లి పుస్తకాలను పరిశీలించారు. సందర్శకులతో పుస్తకాల గురించి కాసేపు ముచ్చటించారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల దివ్యమైన జ్ఞానాన్ని సంపాదించవచ్చునని, లోతైన విజ్ఞానం రావాలంటే చదువు చాలా అవసరమని అన్నారు. లక్షలాది మంది ఆలోచనలు పుస్తక రూపంలో తెచ్చి, ప్రజల్లోకి తీసుకువెళ్లే రచయితల కృషి అభినందనీయమని కొనియాడారు. నేటి యువతరం కోసం గ్రంథాలయాలను పెంచి, పుస్తక పఠనం ప్రోత్సహించాలని సూచించారు. ఆయనతో పాటు బుక్‌ఫేర్ అధ్యక్షులు యాకూబ్, కార్యదర్శి ఆర్ వాసు ఉన్నారు.

**అలరించిన కార్యక్రమాలు:** శనివారం వారాంతం కావటంతో దాదాపు 50వేల మంది సందర్శకులతో పుస్తక ప్రదర్శన ప్రాంగణం కిటకిటలాడింది. సాధిక్ వేదికపై పాపారావు రాసిన మానవాళికి మహోదయం పుస్తకాన్ని శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు వేణుగోపాల్, పాశం యాదగిరి, జతిన్, పబ్లిషర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కవి విశ్వనాథ సత్యనారాయణ రాసిన మ్రోయు తుమ్మెద ఐదవ ముద్రణ పుస్తకాన్ని పొట్టి శ్రీరా ములు ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యా నందరావు ఆవిష్కరించగా, ధూపాటి ప్రభాకర్ రచించిన వెలుగు వైపుగా పుస్తకాన్ని బుక్‌ఫేర్ అధ్యక్షులు యాకూబ్ ఆవిష్కరించారు. బాలోత్సవ కార్యక్రమంలో భాగంగా దాశరథి బ్యాలె సమగ్ర నృత్య రూపకం ఆహుతులను విశేషంగా ఆకర్షించింది. తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి పాత్రను, దాశరథి జీవితంలోని ఘట్టాలను తీసుకుని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి దీనిని రచించగా, దాశరథి కుమార్తె ఇందిరా పరాశరం దర్శకత్వం వహించారు.

హైదరాబాద్ వార్త



# మెట్రో విస్తరణకు చురుకుగా సన్నాహాలు..!

-పాతబస్తీ మెట్రోకు భూసేకరణకు నష్టపరిహారం ఖరారు
-చదరపు గజానికి రూ.81వేల చొప్పున ఆస్తుల సేకరణ
-అంగీకార పత్రం అందించిన వారికి 10రోజుల్లోగా చెక్కులు
-మెట్రో ఎండి ఎన్వీఎస్ రెడ్డి



మెట్రో ప్రయాణికుల కోసం రాపిడోతో ఒప్పందం చేసుకుంటున్న మెట్రో ఎండి ఎన్వీఎస్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 21 ప్రభాతవార్త
ఓల్డ్ సిటీ మెట్రో మార్గంలో రోడ్డు విస్తరణకు సంబంధించిన భూసేకరణ వేగవంతం అయిందని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, హెచ్ఎంఎల్ అధికారులు ప్రభావిత ఆస్తుల యజమానులతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపారని చెప్పారు. తదనుగుణంగా, సేకరించే ఆస్తుల నష్టపరిహారం చదరపు గజానికి రూ.81,000లుగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నిర్ణయించారని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. మెట్రో ప్రయాణికుల కోసం ప్రత్యేక ధరలతో ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీని అందించడానికి ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్‌తో 'రాపిడో' శనివారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నగరంలో మెట్రో విస్తరణ పనులు వేగవంతంగా చేపట్టాలని దృఢ నిశ్చయంతో ఉన్నారని, అందుకు అనుగుణంగా పాత నగరంలో భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. ఇప్పుడు నిర్ణయించిన నష్టపరిహారనికి అనుగుణంగా ఆస్తుల యజమానులు కొందరు ఇప్పటికే తమ అంగీకార పత్రాలను సమర్పించారని, వారికి 10 రోజుల్లోగా నష్టపరిహారం నేరుగా చెక్కు రూపంలో చెల్లిస్తామని స్పష్టం చేశారు. మిగిలిన ఆస్తుల యజమానులు కూడా వీలైనంత త్వరలో తమ అంగీకార పత్రాలను హెచ్ఎంఎల్ కార్యాలయానికి అందజేస్తే వారికి కూడా త్వరలోనే నష్టపరిహారాన్ని చెక్కుల ద్వారా చెల్లిస్తామని ఆయన తెలిపారు.

**మెట్రో ప్రయాణికుల గమ్యస్థానాలకు 'రాపిడో'..**

దేశంలో అతిపెద్ద రైడ్‌హెయిలింగ్ ప్లాట్‌ఫారమ్ అయిన రాపిడో, హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మొదటి మరియు చివరి మైలు వరకు సౌకర్యవంతమైన కనెక్టివిటీని అందించడానికి ఎల్ టి మెట్రో రైల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా, రాపిడో తన బైక్ మెట్రో సర్వీస్ కోసం ప్రత్యేక తగ్గింపు ఫ్లాట్ రేట్లను అందజేస్తుంది, నగరంలోని 57 మెట్రో స్టేషన్‌లలో దేనికైనా ప్రయాణించే కస్టమర్‌లకు కేవలం రూ.30లు నుండి ఛార్జీలు ప్రారంభమవుతాయని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ప్రయాణీకులను తమ గమ్యాలకు చేర్చే రాపిడో లాంటి వాహన సేవలు మహిళలకు కూడా తగు ప్రాధాన్యత కల్పించి, వారిని కూడా పైలట్‌లుగా భాగస్వామ్యులయ్యేలా కృషి చేయాలని సూచించారు. దీని వల్ల మహిళలలో భద్రత భావం పెరుగుతుందని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ సీఓఓ మురళీ వరదరాజన్, రాపిడో చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పవన్ దీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**మెట్రో రైల్ భూసేకరణ వేగవంతం..**

ఎంజిబిఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు 800 ఆస్తుల భూసేకరణ కొరకు ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. ఈ ఆస్తుల నష్టపరిహారం కొరకు ఆస్తుల యజమానులతో చర్చలు జరిపి, ఒక చదరపు గజానికి రు.81,000లు కట్టడం విలువ ఇవ్వడానికి ఒప్పందం జరిగింది. ఇంటి యజమానులు బేగంపేట, రసూల్‌పురాలోని మెట్రో భవన్‌కు వెళ్ళి సమ్మతిని తెలియజేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ గురిశెట్టి తెలిపారు. సమ్మతి ఇచ్చిన 10 రోజులలో మొత్తం నష్టపరిహారం వారికి చెక్ రూపంలో ఇవ్వబడుతుందని ప్రకటించారు.

# మాదాపూర్ ఐటి కారిడార్‌లో భారీ అగ్నిప్రమాదం

-సాఫ్ట్‌వేర్ సంస్థల మధ్యలో ఉన్న రెస్టారెంట్‌లో గ్యాస్ లీకేజీతో పేలుడు


మంటల్లో కాలిపోతున్న డిస్ట్రిక్ట్ 150 బార్ అండ్ రెస్టారెంట్

గచ్చిబౌలి, డిసెంబరు 21 ప్రభాతవార్త
మాదాపూర్ ఐటి కారిడార్ పరిధిలోని జాతీయ, అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థల మధ్యలో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రెస్టారెంట్‌లో గ్యాస్ లీకేజీ కారణంగా ఒక్కసారిగా పేలుడు సంభవించడం, మంటలు అంటుకోవడంతో రెస్టారెంట్‌లోని సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. బార్ అండ్ రెస్టారెంట్ కింద అంతస్థులో ఉన్న పబ్‌లో సైతం మంటలు వ్యాపించి తీవ్ర ఆస్థినష్టం చోటుచేసుకుంది. శనివారం తెల్లవారు జామున ఈ సంఘటన చోటుచేసుకోవడంతో ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. మాదాపూర్ ఫైర్ స్టేషన్ అధికారులు ఫైరింజన్లతో రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదంలో మొత్తం నాలుగు కోట్ల రూపాయల ఆస్థినష్టం సంభవించినట్లు తెలుస్తుంది. ఈ సంఘటకు సంబంధించిన వివరాలు రాయదుర్గం ఇన్స్‌పెక్టర్ వెంకన్న, మాదాపూర్ అధికారి ఫజల్ తెలిపిన ప్రకారం... శేరిలింగంపల్లి మండల పరిదిలోని రాయదుర్గం సర్వే నెంబరు 83లో గల నాలెడ్జ్ సిటీలో ఆరంతస్థుల సత్వా ఎలిక్సిర్ భవనం ఉంది. ఈ భవనం ఐదవ అంతస్థులో డిస్ట్రిక్ట్ 150 బార్ అండ్ రెస్టారెంట్ ఉండగా, ఇదే యాజమాన్యానికి చెందిన క్వారమ్ క్లబ్ నాల్గవ అంతస్థులో ఉంది. కాగా శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో డిస్ట్రిక్ట్ 150 బార్ అండ్ రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్యాస్ లీకేజీతో మంటలు రెస్టారెంట్ మొత్తం వ్యాపించడం, గ్యాస్ లీకేజీతో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో స్థానికంగా ఆహాకారాలు చెలరేగాయి. సమాచారం అందుకున్న మాదాపూర్ ఫైర్ అధికారులు రెండు ఫైరింజన్లతో సంఘటనా స్థలికి చేరుకొని రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే డిస్ట్రిక్ట్ 150 బార్ అండ్ రెస్టారెంట్ మంటల్లో పూర్తిగా కాలి బూడిదైంది. గ్యాస్ లీకేజీతో పాటు బార్‌లో ఉన్న మద్యం సీసాలు, ఖరీదైన విదేశీ మద్యం బాటిళ్లు అంటుకోవడంతో మంటలు మరింతగా వ్యాపించాయి. పేలుడు దాటికి నాల్గవ అంతస్థులో ఉన్న క్వారమ్ క్లబ్ సైతం ద్వంసమైంది. రెస్టారెంట్‌కు ఉన్న గోడలు పగిలిపోయాయి. ఈ భవనం కింది అంతస్థుల్లో పలు కార్యాలయాలు ఉండడం, చుట్టు ప్రక్కల భవనాల్లో ఐటి సంస్థలు ఉన్నాయి. కాగా శనివారం తెల్లవారు జామున ప్రమాదం చోటుచేసుకోవడంతో ఈ సంస్థలు మొత్తం మూసివేసి ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈమేరకు భవనం మేనేజర్ పీయుష్ అగర్వాల్ పోలీసులకు పిర్యాదు చేయడంతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా గ్యాస్ పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీకేజీ జరిగి రెస్టారెంట్ మొత్తం వ్యాపించిందని, శనివారం తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో లైట్లు వేయడంతో ఒక్కసారిగా పేలిపోయి, మంటలు వ్యాపించి ఉంటామని ఫైర్ అదికారి తెలిపారు. రెస్టారెంట్‌లోని ఫర్నీచర్, సామాగ్రితో పాటు మద్యం, ఖరీదైన విదేశీ మద్యం బాటిళ్లు మంటల్లో కాలిపోయాయని, క్వారమ్ క్లబ్‌లో సైతం ఫర్నీచర్ ద్వంసమైందని తెలిపారు. అగ్నిప్రమాదంలో దాదాపు 4కోట్ల రూపాయల మేర ఆస్థినష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈమేరకు రాయదుర్గం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# పాత కక్షలతో హత్యాయత్నం..నడిరోడ్డుపై వేట కొడవళ్లతో దాడి

-ఇద్దరికి తీవ్ర గాయాలు

**ఎల్‌బినగర్, డిసెంబరు 21 ప్రభాతవార్త:** పాత కక్షల నేపద్యంలో నడిరోడ్డుపై యువకులు బరితెగించి వేటకొడవలతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ దాడి ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తట్టిఅన్నారానికి చెందిన బొడ్డు మహేష్ (30) బిగిల్లా పురుషోత్తం (32) వీరిద్దరూ స్నేహితులు. రెండు సంవత్సరాల క్రితం పురుషోత్తం వివాహం జరగగా ఊరేగింపు జరుగుతున్న సమయంలో మహేష్‌తో గొడవ జరగడంతో పురుషోత్తం బీరుసీసాతో మహేష్‌పై దాడి చేసి గాయపరిచాడు. మహేష్ పై దాడి చేసిన సంఘటనకు సంబంధించి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో పురుషోత్తం అతని స్నేహితుడు రాము(28)పై ఫిర్యాదు చేయగా వారి ఇరువురిపై కేసు నమోదయింది. వీరు ఇరువురి మధ్య రాజీప్రయత్నాలు కూడా జరిగాయి. కాగా శుక్రవారం కేసుకు సంబంధించి రంగారెడ్డి జిల్లా కోర్టుకు మహేష్ రావలసి ఉండగా సూర్యాపేటలో ఉన్నందువల్ల తాను కోర్టుకు హాజరు కాలేకపోతున్నానని కోర్టు కానిస్టేబుల్‌కు చెప్పడంతో కేసు వాయిదా పడింది. దీంతో పురుషోత్తం, రాము, నాగరాజు మరికొందరు కలిసి నాగోల్ రోడ్డులో ఉన్న ఓ బారులో మద్యం సేవించారు. వీరంతా అక్కడ ఉన్న సమాచారం తెలుసుకున్న మహేష్ అతని స్నేహితులు దాసరి సురేందర్ అలియాస్ సూరి, బెల్లి భరత్ తదితరులు కారు, బైకులపై వచ్చారు. పురుషోత్తమను హత్య చేయాలని నిర్ణయించుకున్న వారు వేట కొడవలితో వారిపై దాడి చేయబోగా పురుషోత్తం అక్కడి నుంచి తప్పించుకొని పారిపోయాడు. పురుషోత్తం స్నేహితులైన తుకారం గేటుకు చెందిన గడ్డమైన రాము, నాగోల్‌కు చెందిన పాశం నాగరాజులకు ఈ దాడిలో తీవ్ర గాయాలయ్యాయి. వేట కొడవలతో దాడి జరగగా ప్రాణాలను కాపాడుకునేందుకు సమీపంలోని ఓ బ్యాంకులో తల దాచుకున్న రాముపై వేట కొడవలతో దాడి చేయడంతో ఆ ప్రాంతమంతా రక్తమడుగును తలపించింది. ఈ సంఘటనలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, చైతన్యపురి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు హత్యాయత్నానికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# న్యూ ఇయర్ జోష్‌పై "ఎక్సైజ్‌శాఖ" నజర్

-గ్రేటర్ పరిధిలో 40 ప్రత్యేక టీంలు ఏర్పాటు
-ఎన్‌డిపి లిక్కర్, డ్రగ్స్ వినియోగంపై ప్రత్యేక దృష్టి
-బస్సులు, రైళ్లు, చెక్‌పోస్టుల్లో ముమ్మరంగా తనిఖీలు



**హైదరాబాద్, డిసెంబరు 21,ప్రభాతవార్త:** తెలంగాణలో మందు, విందుతో ప్రజలు సంబరాలు చేసుకునే పండుగ దసరా. ఆతర్వాత ఆదేస్థాయిలో వాటి వినియోగం కొత్త సంవత్సర వేడుకల్లో కనిపిస్తుంది. అలాగే ఈన్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ అధికసంఖ్యలో వినియోగం ఉంటుందన్న విమర్శలు ఏళ్లుగా వనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో న్యూయిర్ వేడుకలపై ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ఫోకస్ పెట్టింది. అందుకు జిహెచ్ఎంసి పరిధిలోని స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ అధికారులతో పాటు మరికొంతమంది ప్రత్యేక అధికారులను నియమిస్తూ 40 టీంలను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా కొత్త సంవత్సర వేడుకల్లో ఎక్సైజ్ శాఖ రెండు విభాగాలపై దృష్టి పెట్టింది. వేడుకల్లో ఎవ్వరైన తెలంగాణ ప్రభుత్వ అమోదిత మద్యం కాకుండా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని వినియోగిస్తే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగంగా కేసులు నమోదు చేయాలని నిఘా టీమ్‌లకు ఉన్నతాధికారులు అదేశించారు. అలాగే ఈవేడుకల్లో మద్యంకు బదులు డ్రగ్స్ తీసుకుంటే కూడా కఠిన చర్యలు ఉంటాయని నార్కోటిక్స్, డ్రగ్స్, అండ్ సైకోట్రాపక్ (ఎన్‌డిపిఎస్) చట్టం కేసులు నమోదు చేస్తారని చెబుతున్నారు. అలాగే ఎన్‌డీపీఎస్ కింద వచ్చే కోకైన్, ఎండిఎంఏ, ఎల్‌ఎస్‌డి బాస్ట్స్, గంజాయి, హషిష్ అయిల్, అల్పోజోలం, డైజోఫామ్ , హైడ్రో క్లోరిక్ తోపాటు మరి కొన్ని మత్తు కలిగించే మత్తు పదార్థానలు వినియోగిస్తే కఠినమైన కేసులు నమోదు చేస్తామని తెలుపుతున్నారు.

**అనుమానిత వ్యక్తులకు డ్రగ్ డిటెక్షన్ టెస్ట్..**

డ్రగ్స్ వినియోగించే వారి వివరాలు తెలుసుకోవడానికి ఎక్సైజ్‌శాఖ ప్రత్యేకంగా డ్రగ్ డిటెక్షన్ టెస్ట్ చేయనుంది. పార్టీల్లో అనుమానిత వ్యక్తులను గుర్తించి పరీక్షలు నిర్వహించనుంది. ఈపరీక్షల్లో పాజిటివ్ వస్తే వారిపై కేసులు నమోదు చేస్తారు. ఇందు కోసం తనిఖీలు నిర్వహించే ప్రత్యేక టీమ్‌లకు డ్రగ్ డిటెక్షన్ కిట్స్‌ను అందించారు. ముఖ్యంగా కమర్షియల్ స్థలాల్లో మద్యం వినియోగించుకోవడానికి అనుమతి తీసుకున్న ప్రాంతాల్లో పబ్బులు, బార్లలోను ఈతనిఖీలు చేస్తారు.

**రవాణ వ్యవస్థపై నిఘా ..**

కొత్త సంవత్సర వేడుకల ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యే నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్, డ్రగ్స్ రవాణ అయ్యే వ్యవస్థపై ఎక్సైజ్ శాఖ నిఘా ఏర్పాటు చేసింది.ప్రధానంగా బెంగుళూర్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చే ట్రావెల్స్‌లో నిత్యం ఎక్సైజ్ శాఖ తనిఖీలు చేపడుతుంది. రాజస్థాన్, ఢిల్లీ , పంజాబ్, హర్యానా, ఇతర రాష్ట్రాల నుంచి నుంచి వచ్చె రైళ్లలోను ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. వీటితోపాటు గంజాయి అమ్మకాలకు పేరుగాంచిన నానక్‌రాంగూడ, ధూల్‌పేట్ లతోపాటు జిహెచ్ఎంసి పరిధిలోకి వచ్చే అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీలను డిసెంబరు 31 వరకు మరింతగా ముమ్మరం చేయనున్నారు.

**నిఘా మరింతగా పెంచాం : వి.బి.కమలాసన్‌రెడ్డి ( ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ )**

కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ముఖ్యంగా నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్, డ్రగ్స్ వినియోగంపై నిఘా పెట్టాం. వేడుకల్లో ఎన్‌డిపి లిక్కర్, డ్రగ్స్ వినియోగిస్తే కేసులు కేసులు నమోదు చేస్తాం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే లిక్కర్, డ్రగ్స్‌పైనా ప్రత్యేక దృష్టిసారించాం. ఇప్పటికే పలువురు పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశాం. వేడుకల నాటికి ఈముఠాలకు చెక్‌పెట్టేందుకు జిహెచ్ఎంసి పరిధిలో 40ప్రత్యేక టీమ్‌ల ద్వారా నిరంతరం అనుమానిత ప్రాంతాల్లోట్టి తనిఖీలు చేస్తున్నామని కమలాసన్‌రెడ్డి తెలిపారు.

## ముగ్ధమనోహరం జనరంజకం కూచిపూడి నృత్యం



**రవీంద్రభారతి, డిసెంబరు 21 ప్రభాతవార్త :** సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ నిర్వహణలో శనివారం రాత్రి బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ వేదికలో ప్రఖ్యాత నాట్యగురువు వి.పద్మకళ్యాణ్ శిష్యురాలు డా. టి.ఎస్.దీప్తి సరోజిని సప్తరంజని పేరిట కూచిపూడి రంగప్రవేశం ముగ్ధమనోహరం, జనరంజకంగా ఆహుతులను ఆకట్టుకుంది. భారతీయ శాస్త్రీయ నృత్యంపట్ల ఆసక్తి, అభిరుచితో రెండుసార్లు మోకాలికి శస్త్రచికిత్స జరిగినా మొక్కవోలని దీక్ష, పట్టుదలతో ఎనిమిదేళ్లు కఠోరశ్రమతో కూచిపూడి నృత్యాన్ని గురువు పద్మకళ్యాణ్ వద్ద సంపూర్ణంగా అభ్యసించిన దీప్తి తన నృత్యనిపుణతను చాటుతూ కూచిపూడి రంగప్రవేశ ప్రదర్శనలో మోహన రాగంలో అనిరుద్ధ శబ్దం; భూపాలరాగం ఆదితాళంలో పూజా నృత్యం; భైరవిరాగం మిశ్రచాపు తాళంలో స్వరజతి; అరభి/మోహనరాగం ఆదితాళంలో భామాకలాపం; నారాయణతీర్థ కీర్తన జయజయ వైష్ణవిదుర్గే; ఈరేయి గడిచేటి జావళి; అమృతవర్షిణిరాగం ఆదితాళంలో జతికట్టు తదితర అంశాలను సుమారు రెండుగంటలపాటు నిర్విరామంగా అత్యంత అద్భుత హావభావాలను అలవోకగా శృతిలయబద్ధంతో ప్రదర్శించి అశేష ప్రేక్షకుల ప్రశంసలు, శుభాభినందనలు అందుకుంది. వాద్యసహకారంలో గురువు వి.పద్మకళ్యాణ్ కొరియోగ్రఫీ, నట్టువాంగం; వెంపటి శ్రీవల్లిశర్మ గాత్రం; వి.శ్రీధరాచార్య మృదంగం; కె.సాయికుమార్ వయోలిన్; ఉమా వెంకటేశ్వర్లు వేణువు; డా. ఆర్.శ్రీకాంత్ తబలతో అద్భుతంగా అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించి మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన పద్మభూషణ్ గ్రహీత డా. స్వప్నసుందరి, డా. శ్రీనివాస్ తదితరులు కళాకారిణి, నాట్యగురువులను ఎంతగానో అభినందించారు.

## వన్ పెగ్ బార్‌పై బాచుపల్లి పోలీసులు దాడి..

-డిజె సౌండ్ సిస్టమ్‌ను సీజ్ చేసిన అధికారులు..

కొంపల్లి, డిసెంబర్ 21, ప్రభాతవార్త
చెవులు దద్దరిల్లే డీజే సౌండ్ సిస్టం, లేజర్ లైట్స్ తో పాటలు ప్లే చేస్తూ యువతీ, యువకులతో అసభ్యకరంగా నృత్యాలు చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా అసలు అనుమతులు సైతం తీసుకోకుండా విచ్చల విడిగా బార్ అండ్ రెస్టారెంట్ మాటున బాచుపల్లిలో నిర్వహిస్తున్న శ్రీనిధి డెవలపర్స్ ఆహ్లాదం పెగ్ బ్రో రెస్టారెంట్, పబ్ పై ఎస్‌ఓటీ, బాచుపల్లి పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఆహ్లాదం పెగ్ బ్రో రెస్టారెంట్ అండ్ బార్‌ను గత కొద్ది రోజుల క్రితమే తెలంగాణ రాష్ట్ర పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డిలతో గ్రాండ్‌గా ఓపెనింగ్ చేయించారు. ప్రభుత్వ పెద్దలే మనకు అండగా నిలబడ్డారు ఇక బార్ అని చెప్పి పబ్ కార్యకలాపాలు నడిపితే మమ్మల్ని అడ్డుకునే ధైర్యం ఎక్కడిది, ఎవ్వరికి ఉంది అని అనుకున్నారో ఏమో కానీ నిబంధనలు తుంగలో తొక్కి విష సంస్కృతికి ఆజ్యం పోస్తున్నారు. డబ్బు సంపాదనే యావగా పెట్టుకున్న సదరు ఆహ్లాదం బార్ అండ్ పెగ్ బ్రో రెస్టారెంట్ విచ్చలవిడిగా విశృంఖల చేష్టలకు దిగుతూ స్థానిక పౌర సమాజానికి విఘాతం కల్గిస్తుంది. అర్ధరాత్రి మద్యం మత్తులో భారీ మ్యూజిక్ సౌండ్‌లతో చిందులు వేస్తూ అసభ్య నృత్యాలకు తెరలేపారు. స్థానిక పౌరుల ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి సైబరాబాద్ ఎస్‌ఓటీ, బాచుపల్లి పోలీసులు సంయుక్త దాడులు నిర్వహించారు. ఆహ్లాదం బార్ అండ్ రెస్టారెంట్ పై కేసులు నమోదు చేసి మ్యూజిక్ పరికరాలు సీజ్ చేసినట్లు సమాచారం.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ముగిసిన వజ్రోత్సవాలు

-అనుభవాలను పంచుకున్న పూర్వ విద్యార్థులు



**అత్తాపూర్ డిసెంబరు21,ప్రభాతవార్త :**
వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల్లో రెండవ రోజు శనివవారం సాయంత్రం పూర్వ విద్యార్థుల సమ్మేళనం, ముగింపు సమావేశాలు జరిగాయి. దీనిలో విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు అయి ఉండి ఐఎఎస్,ఐపిఎస్ బ్యాంకర్లు, పారిశ్రామికవేత్తలు, ప్రజా ప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహించిన, ప్రస్తుతం నిర్వహిస్తున్న అనేకమంది తమ అనుభవాలని పంచుకున్నారు. విశ్వవి ద్యాలయం భవిష్యత్ ప్రణాళికలపై తమ సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరై పూర్వ విద్యార్థులు ప్రముఖులు మర్రి శశిధర్ రెడ్డి, వి. నాగిరెడ్డి మాజీ ఐఎఎస్, డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, జస్టిస్ వామన్ రావు డాక్టర్, బి. రాజేందర్ ఐఎఎస్, రాజేశ్వరరావు ,(కరీంనగర్ డైరీ), హరీష్ రఘు, రాజశేఖర్ రెడ్డి శీలం (24 మంత్ర), మక్సుద్ హుస్సేన్, తారా సత్యవతి, వై. నాగిరెడ్డి ఐపిఎస్, డాక్టర్ టీ వీ కే సింగ్, టి. రవీంద్రనాథ్, నార్ల రవి శర్మ, డాక్టర్ చింతల గోవిందరాజులు (నాబార్డ్ మాజీ చైర్మన్), మదన్ మోహన్ రావు (ఎల్లారెడ్డి శాసనసభ్యులు), సిహెచ్ శ్రీనివాసరావు (నార్మ్ డైరెక్టర్), డాక్టర్ రాజేష్ కుమార్ (ఎస్బిఐ సిజిఎం), డాక్టర్ వి. ప్రవీణ్ రావు (మాజీ విసి) తదితరులు తమ అనుభవాలను పంచుకున్నారు.అనంతరం పిజెటిఎయు ఉపకులపతి అల్దాస్ జానయ్య అందరికీ ధన్యవాదాలు తెలిపారు. 60 ఏళ్ల అపూర్వ చరిత్రను స్మరించుకుంటూ భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఈ ఉత్సవాలని నిర్వహించామన్నారు. విశ్వవిద్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ఏర్పాటుకు సిఎస్‌ఆర్ నిధుల కింద 15 కోట్లు అందించేందుకు ఎస్‌బిఐ చైర్మన్, ఈ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి శ్రీనివాసులు శెట్టి ఈరోజు ఆమోదం తెలిపారని జానయ్య ప్రకటించారు. అదేవిధంగా కళాశాల పూర్వ విద్యార్థి శాస్త్రవేత్త గిజురీ సింగ్ కుటుంబం బంగారు పతకం ప్రకటించిందని జానయ్య తెలిపారు.

## చిన్నపిల్లలకు వాడే నకిలీ మందులు సీజ్

**కంటోన్మెంట్, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** చిన్నపిల్లలకు వాడే నకిలీ మందులను సికింద్రాబాద్ డ్రగ్ అధికారులు సీజ్ చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ తెలిపిన వివరాల ప్రకారం కార్ఖానాలో క్యూర్‌జెన్ కంపెనితో తయారి సంస్థ పేరుతో చిన్న పిల్లలకు ఉపయోగించే (ఐరన్, హైడ్రాక్సైడ్) కల్ట్‌ఫెర్ డ్రాప్స్ నకిలీ మందులను నిర్వాహకుడు రాజనరేందర్ తన కార్యాలయంలో విక్రహిస్తున్నాడు. సమాచారం అందుకున్న డ్రగ్ అధికారులు దాడులు జరిపి పెద్దయెత్తున నకిలీ మందులను సీజ్ చేశారు. నిందితుడిపై సికింద్రాబాద్ కోర్టులో కేసు ఫైల్ చేశారు.

## ప్రహరీగోడ కూలడంతో ద్విచక్ర వాహనాలు నుజ్జునుజ్జు


ద్విచక్ర వాహనాలపై కూలిన ప్రహరీగోడ

**ఎల్‌బినగర్, డిసెంబరు 21 ప్రభాతవార్త:**
పార్కు చేసి ఉన్న వాహనాలపై ప్రహరీగోడ కూలడంతో ద్విచక్ర వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పక్కవీధిలోనే ఈ సంఘటన చోటుచేసుకుంది. చైతన్యపురి మెట్రోస్టేషన్ సమీపంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం అవుతున్న ప్రభాత్‌నగర్ కాలనీ ప్రహరీగోడ పక్కన ప్రతిరోజు మెట్రో ప్రయాణికులు తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తారు. కాగా శనివారం సాయంత్రం ఆసుపత్రి నిర్మాణం జరుగుతున్న స్థలం చుట్టూ ఉన్న ప్రహరీగోడ కూలిపోయింది. దీంతో అక్కడ పార్కుచేసి ఉన్న సుమారు 30కిపైగా ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. మెట్రోస్టేషన్‌కు పక్కనే ప్రహరీగోడ ఉండడంవల్ల ప్రతిరోజు వందలాది వాహనాలు ఆ ప్రహరీగోడ పక్కన పార్కింగ్ చేస్తున్నారు. కాగా శనివారం సాయంత్రం ప్రహరీగోడ కూలిపోవడంతో ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. ప్రహరీ గోడ కూలిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్

**-ప్రముఖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు**



పరుచూరి వెంకటేశ్వరరావును సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త:** వినప్పుడే ఉజ్వల భవిష్యత్కు అడుగు పడుతుందని ప్రముఖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక తను వెలికితీసి వారిని ఆయా రంగాలలో ప్రోత్స హించాలని పేర్కొన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో గీతాంజలి హైస్కూల్ 42వ వార్షికోత్స వ వేడుకలకు ముఖ్యఅతిథిగా పరుచూరి వెంకటేశ్వరరావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. పిల్లలకు చిన్న తనం నుంచే తె లుగు సాంప్రదాయాలను తెలియజే యాల్సి న అవసరం ఎంతైనా ఉంద ని పేర్కొన్నారు. గీతాంజలి హైస్కూల్ 42 సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్య మైన విద్యను అందించ డమే కాకుండా వివిధ రంగా లలో ప్రోత్స హించడం అభినందనీయమ న్నారు. ఈ సందర్భంగా సి.ఎస్.రావు జ్ఞాపకార్థం సిఎస్ రావు థియేటర్స్ అవార్డును పరుచూరి వెంకటేశ్వరరావు ప్రదానం చేశారు. సభకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన ప లు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీ నటులు ప్రీతినిగం, నగేష్ కర్ర, ప్రో. డిఎస్ఎన్ మూర్తి, గీతాంజలి విద్యాసంస్థల కార్యదర్శి ఎన్.శాంత, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత గొంతు కవిటి రాజశేఖర్ : ప్రొపెసర్ కంచె ఐలయ్య




పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త:** దళితుల పక్షనా చరిత్రలో మొట్టమొదటి సారి అధిపత్య కులాలానికి చెందిన విటి రాజశేఖర్ దళితుల గొంతుకగా మారదని ప్రొపెసర్ కంచె ఐలయ్య అన్నారు. దళిత్ వాయిస్ ఎడిటర్, రచయిత, అంబేద్కరైట్ కార్యకర్త, బహుజన ఐక్యత మెధావి వి.టి.రాజశేఖర్ సంస్మరణ సభ సమాంతర అధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగింది. ఈ సభలో తొలి తరం దళిత నేత బత్తుల శ్యామ్ సుందర్ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్బంగా ప్రొపెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ మహరాష్ట్రలో జరిగిన దళిత్ పాంథర్స్ ఉద్యమాన్ని దేశమంతా ప్రచారం చెశాడన్నారు. దళిత్ అనె పదానికి అర్థం చెన్ను మహ మెధావి అన్నారు. దళిత్ వాయిస్ పత్రిక ద్వారా ఎన్నో రచనలు చెశాడన్నారు. దళితుల, ముస్లిం ల ఐక్యత కొసం కృషి చెశాడన్నారు. సరఈ సంస్మరణ సభలో విటి.రాజశేఖర్ కుమారుడు సలిమ్ శెట్టి, ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్, మసూద్, ప్రకాశ్ మూల భారతి, డాక్టర్ ఆలీమ్ ఖాన్, సమాంతర ఎడిటర్ వరుణ్ కుమార్, గద్దర్ పౌండెషన్ ప్రధాన కార్యదర్శి జి.వి.సూర్య కిరణ్, సినియర్ దళిత నేతలు కొరివి వినయ్ కుమార్, జె.గౌతమ్, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, నల్ల బాబు, క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చౌతాలా మృతికి సంతాపం తెలిపిన రాష్ట్ర కమిటీ

**సైఫాబాద్, డిసెంబరు 21 ప్రభాతవార్త:** హరియాణా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ చౌటాలా మృతి పట్ల పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గం సమావేశమైంది. చౌటాలా చిత్రపటానికి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ రాష్ట్ర కమిటి రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ చౌటాలా రైతు బాంధువుడని, ఐదు సార్లు హరియాణా రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి, పేద, బడుగు బలహీనవర్గాలకు విశేషమైన సేవలు అందించారని, ముఖ్యంగా రైతుల పక్షపాతిగా కొనసాగారని కొనియాడారు. సమాజానికి చౌటాలా చేసిన సేవలు మరువలేనివని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కమిటి నాయుకులు రాజు, రమేష్, సత్యవతి, ఘూస్సీ, యాదయ్య, రాములు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న కార్యకర్తలు

**సైఫాబాద్, డిసెంబరు 21 ప్రభాతవార్త:** రాజ్యాంగం ద్వారా దేశపౌరులకు స్వేచ్ఛా, సామానత్వం, సౌభ్రాతృత్వం, అందించిన భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్‌ను కించ పరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ఆనేక మంది కార్యకర్తలు అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ బిజెపి శ్రేణులు అంబేద్కర్‌ను అవమానిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ నిరసన ప్రదర్శనలో పార్టీ అడ్వకేట్స్ విభాగం ప్రధాన కార్యదర్శి యమునాగౌడ్, డాక్టర్స్ విభాగం అధ్యక్షురాలు లక్ష్యానాయుడు, నాయకులు విజయ్‌ఫ్సా సలాం, జావీద్ షరీఫ్, ఖలీమ్‌బాబా, అహసన్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## కారు రిజిస్ట్రేషన్ కోసం
## ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**కంటోన్మెంట్, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తిరుమలగిరి కార్యాలయానికి విచ్చేశారు. తన నూతన కారు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయంలో ఫొటో దిగి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా తిరుమలగిరి ఆర్టీఓ స్వామి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బోనగిరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకపు రోడ్లు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

**- వేసిన రోడ్లపై మళ్లీ రోడ్డు వేస్తున్నారంటూ ఆగ్రహం**



మణికొండ మున్సిపాలిటీలో పాడైపోయిన రోడ్లను పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

**నార్సింగి, డిసెంబర్ 21 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నాసిరకపు రోడ్లు వేసిన కాంట్రాక్టర్లపై, పర్యవేక్షించని మున్సిపల్ అధికారులపై బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసిన రోడ్లపై మళ్లీ మళ్లీ రోడ్లు వేస్తున్నా ఆ రోడ్లు కుంగిపోతున్నాయంటే కాంట్రాక్టర్లు ఎంత నాసిరకపు పనులు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. శనివారం మణికొండ మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు ధూళిపాళ్ల సీతారాం, కౌన్సిలర్ ఆలస్యం నవీన్ కుమార్ తదితరుల బృందం మణికొండలోని అంజలీ గార్డెన్, పైప్‌లైన్ రోడ్లను పరిశీలించారు. స్థానిక ప్రజలను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఓ బిల్డర్ రోడ్డును పగులగొట్టి డ్రైనేజీ పైపులు వేసుకున్నారని, ఆపై రోడ్డు వేసినా కుంగిపోతుందని స్థానికులు బిఆర్ఎస్ నాయకుల బృందం దృష్టికి తీసుకువచ్చారు. పగుళ్లు పడి, గోతులమయమైన రోడ్డుపై నిత్యం ద్విచక్రవాహన దారులు కిందపడుతున్నారని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం, నవీన్ కుమార్‌లు మాట్లాడుతూ పాడైపోయిన రోడ్లను వెంటనే పాత కాంట్రాక్టర్లతోనే బాగు చేయించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉన్నతాధికారుల దృష్టికి మణికొండ మున్సిపాలిటీలో జరుగుతున్న నాశీరకమైన రోడ్ల దుస్థితి, దాంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీసుకెళ్తామని, అవసరమైతే స్థానిక ప్రజలతో కలిసి ధర్నాల చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అందె లక్ష్మణ్‌రావ్, గుట్టమీది రాఘవేందర్, సంగం శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, మాల్యాద్రి నాయుడు, ఏర్పుల శ్రీకాంత్, యాలా కిరణ్, దిలీప్, శ్రీధర్, భానుచందర్, ప్రవీణ్, షేక్ ఆరీఫ్, సుమ, రేఖ, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంసి ప్లాంట్లు తొలగించాలని ఎమ్మెల్యేకు వినతి

**- ప్రజల ఇబ్బందులు దూరం చేయడం నా బాధ్యత : ప్రకాశ్‌గౌడ్**



ఆర్ఎంసి ప్లాంట్‌లను తొలగించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నార్సింగిలోని మైహోమ్ అవతార్, హాల్‌మార్క్ వివినియా సభ్యులు.

**నార్సింగి, డిసెంబర్ 21 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మైహోమ్ అవతార్, హాల్‌మార్క్ వివినియా ప్రాంతాలలో ఉన్న ఆర్ఎంసి ప్లాంట్లను తొలగించాలని కోరుతూ శనివారం స్థానికులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ను కలిసి వినతిపత్రంను అందజేశారు. ప్లాంట్లకు రోజూ వచ్చీ, వెళ్లే భారీ వాహనాల వలన రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని, ఈ ప్లాంట్ల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి కారణంగా చాలా మంది శ్వాసకోశ వ్యాధితో అవస్థలు పడుతున్నారన్నారు. వేలాది మంది ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారిన ఈ ఆర్ఎంసి ప్లాంట్లు తొలగించాలని అనేకమార్లు పిసిబి అధికారులు, మున్సిపల్ చైర్మన్, కమీషనర్‌లకు వినతి పత్రాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ సారి మైహోం అవతార్ జంక్షన్ వద్ద ధర్నా కూడా చేశామని ఎమ్మెల్యేకు వివరించారు. పిసిబి అధికారుల సహకారంతోనే ఆర్ఎంసి ప్లాంట్లు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పందిస్తూ... నేను ఉన్నదే ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకని, ఈ సమస్యను వెంటనే పరిష్కరింపచేస్తానని తెలిపారు. కాలనీల ప్రజల ముందే సంబంధిత పిసిబి అధికారులకు ఫోన్లు చేసి రెండు, మూడు రోజుల్లో ప్రజలను అవస్థలకు గురి చేస్తున్న ఆర్ఎంసి ప్లాంట్లు తొలగించాలని ఆదేశించారు. లేదంటే ప్రజలకు మద్దతుగా నేను కూడా ఆందోళనలో కూర్చుంటానని, మీ ఉద్యోగాలకు ఎసరు రాకముందే స్పందించాలని హెచ్చరించారు. దీంతో అధికారులు వెంటనే తొలగిస్తామని ఎమ్మెల్యేకు మాటిచ్చారు. ఎమ్మెల్యే స్పందన పట్ల ప్రజలంతా ఆనందంను వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పట్ల ఇంత వేగంగా స్పందిస్తుండడం వల్లనే వరుసగా నాలుగు సార్లు ప్రకాశ్‌గౌడ్ ఎమ్మెల్యేగా గెలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, మణికొండ మున్సిపల్ కౌన్సిలర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రవణ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాతో హైదరాబాద్ అతలాకుతలం

**-కుదేలైనా నిర్మాణ రంగం...భయాందోళనలో పేద వర్గాలు**

**-మండలిలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు**

**దుండిగల్, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** కరోనా సమయంలో ప్రపంచం ఏవిధంగా భయపడిందో హైడ్రా రాకతో హైదరాబాద్‌లో పేదవర్గాల ప్రజలు అదే విధంగా భయాందోళనకు గురవుతున్నారని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు శంభీపూర్‌రాజు పేర్కొన్నారు. శాసనమండలిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంటుంది. హైడ్రా వచ్చినప్పటి నుండి హైదారాబాద్‌లోని పేదవర్గాలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. హెచ్ఎండిఏ, ఇరిగేషన్, జిహెచ్ఎంసి అనుమతులు ఉన్నప్పటికి రాత్రికే రాత్రికే కూల్చివేతలు జరుపుతున్న పరిస్థితి ఉంది. కూల్చివేతలు సైతం కోర్టుకు సెలవులు ఉన్న ముందు రోజు చేపడుతున్నారు. జులైకు ముందు నిర్మాణం జరిగినవి కూల్చబోమని హైడ్రా కమీషనర్ రంగనాథ్ ఇటీవల పేర్కొన్నారు. అసలు హైడ్రాకు చట్టబద్ధత ఉందా? వ్యవస్థ ఏర్పాటైనా మరుసటి రోజు నుండే కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతలతో జరిగిన నష్టాన్ని.. పోయిన ప్రాణాలకు కమీషనర్ రంగనాథ్ బాధ్యత వహిస్తారా..? ముఖ్యమంత్రి బాధ్యత వహిస్తారా..?. చట్ట సభలు చట్టాలు చేస్తాయి. వాటి సంబంధించి వివరాలు మంత్రులు గాని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజలకు వివరిస్తారు. హైడ్రా ఏర్పాటైన తరువాత వ్యవస్థకు చట్టం, హక్కులు ఏమి తెలియకుండానే కమీషనర్ రంగనాథ్ మీడియాకు ఏహక్కుతో ఇంటర్వ్యూలు ఇచ్చారు. ప్రజలను ఎందుకు భయభ్రాంతులకు గురి చేశారు. దీని వలన శివారు ప్రాంత వాసులు ఏదైనా పనికోసం జిహెచ్ఎంసి రావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.

## లాస్యరంజని ఆంధ్రనాట్యాలయ నృత్యవిన్యాసాలు



ఆంధ్రనాట్య ప్రదర్శనలో చిన్నారి కళాకారులు నృత్యవిన్యాసం

**నాంపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త :** వందలాదిమంది చిన్నారి కళాకరులకు ఆంధ్రనాట్యంలో ప్రఖ్యాత నాట్యగురు రేఖ గరిషకుర్తిచే అద్భుత శిక్షణనిస్తూ గొప్ప భావికళాకారులుగా తీర్చిదిద్దుతున్న లాస్యరంజని క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ స్థాపించబడి 10 సంవత్సరాలు పూర్తిచేసుకొని ఈరోజు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో దశమ వార్షికోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించుకుంది. ఈ వేడుకల్లో నృత్యగురువు రేఖ ఆధ్వరంలో 28మంది అకాడమీ శిష్యకళాకారులచే ప్రదర్శించిన ఆంధ్రనాట్య ప్రదర్శన ముందుగా కుంభహారతితో ప్రారంభమై వినాకౌతం, అన్నమాచార్య కీర్తన, దశవతార శబ్దం, కైవరం తదితర అంశాలు విచ్చేసిన అశేషప్రేక్షకులను తన్మయుల్ని చేశాయి. పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉమామహేశ్వరి, సీనియర్ పాత్రికేయుడు డా. మహ్మద్‌రఫీ, విశ్రాంత ఇస్రో శాస్త్రవేత్త దేవీప్రసాద్‌శర్మ, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారగ్రహీత డా. కళాకృష్ణ తదితరులు అతిథులుగా విచ్చేసి ముందుగా గురువు రేఖను, దశమ వార్షికోత్సవాన్ని జరుపుకొంటున్న అకాడమీని, అద్భుత నాట్యప్రదర్శనలు కావించి కళాకారులను ఎంతగానో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## స్కూల్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు




బాయిస్ టౌన్ హైస్కూల్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**చార్మినార్, డిసెంబరు 21 ప్రభాతవార్త :** పాతబస్తీ జహనుమాలోని సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూల్‌లో శనివారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బాయిస్ టౌన్ హైస్కూల్ బ్రదర్ శౌరిరెడ్డి, ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోనీ, వైస్ ప్రిన్సిపాల్ టోనీతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. బ్రదర్ శౌరిరెడ్డి క్రిస్మస్ ప్రాముఖ్యత గురించి వివరించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు.

# వివిఎన్ఆర్ విజెఐఈటీలో ముగిసిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు..

**నిజాంపేట్, డిసెంబర్ 21, ప్రభాతవార్త**




ప్రగతినగర్‌లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మూడు రోజుల పాటు కళాశాలలోని ఎలెక్ట్రానిక్స్, కంప్యూటింగ్ సంబంధిత ఏడు విభాగాలు సమిష్టిగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు జరిగింది. మైక్రో ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్, కంప్యూటింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ రంగాలో ఇటీవలి పోకడలు ఇతివృత్తంగా జరుగుతున్న ఈ సదస్సుకి ఐఈఈఈ హైదరాబాద్ విభాగం, మ్యాథ్‌వర్క్స్ సంస్థలు సంకేతిక ప్రాయోజకులుగా వ్యవహరించాయి. యూఎస్ఎ, జపాన్లతో సహా భారత దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సాంకేతికరంగ నిపుణులు, పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమకి చెందిన నిష్ణాతులు వివిధ కీలకోపన్యాసలు, శిక్షణా కార్యక్రమాలు, కార్యశాల, చర్చాగోష్టులు కూడా ఈ సదస్సులో భాగం కాగా కళాశాలలోని సంగీత, శాస్త్రీయనృత్య, నాట్యాలకు చెందిన విద్యార్థి కూటములు క్రెసెండో, నృత్యతరంగ్, లైవ్‌వైర్ సభ్యులు సదస్సుకి వచ్చిన ఆహూతులను తమ కళా ప్రదర్శనలతో అలరించారు. వేగంగా పురోగమిస్తున్న సాంకేతికత నేపథ్యంలో మారుతున్న సామాజిక ముఖచిత్రాన్ని, సాంస్కృతిక, పర్యావరణ మార్పులని కూడా ఈ సదస్సు లో చర్చించగా విద్యార్థులు, అధ్యాపకులు, యువ పరిశోధకులు, పరిశ్రమ వర్గాలు పాల్గొని ఆయా చర్చలని పరిపుష్టం చేసి భవిష్యత్ సాంకేతికాభివృద్ధికి దిశానిర్దేశం చేయటంలో ఈ సదస్సు ఒక ముఖ్యమైన మజిలీ అయిందని నిర్వాహకులు తమ సంతృప్తిని వ్యక్తం చేసారు. సమాచారరంగంలోనూ, ఎలెక్ట్రానిక్స్‌లోనూ, కంప్యూటింగ్ రంగంలోనూ ఇటీవల వచ్చిన మార్పుల వలన ఒక దశాబ్దం క్రితం ఊహకైనా అందని సాంకేతికత నేడు ప్రపంచానికి అందుబాటులో ఉందని, ప్రభుత్వాల సహకారంతో తగిన జాగ్రత్తలతో సాంకేతికతను శ్రేయస్సు కోసమే వాడేటట్టు చూడటం సాంకేతికరంగంలో అందరూ పూనుకుని సాధించటం అత్యవసరమని అతిథులు సూచించారు. తగిన అనుభవం, నైపుణ్యము ఉన్న విఎన్ఆర్ విజెఐఈటీ కళాశాల కార్యవర్గ, యాజమాన్య సభ్యులను, నిర్వాహకులను సదస్సుకి ఆహ్వానితులుగా వచ్చిన నిపుణులు, అతిథులు, ఐఈఈఈ కార్యవర్గ సభ్యులు అభినందించారు. నేటి కాలంలో ఛాటిజిపిటి వంటి ఉత్పాక కృత్రిమమేధ (జెనెరేటివ్ ఏఐ) వలన, దాదాపు అన్ని రంగాల్లో వాడుతున్న కృత్రిమమేధ అప్లికేషన్ల వలన పర్యావరణం పై భారం పెరగడమే కాక సమాచారం విశ్వసనీయత ప్రశ్నార్థకమైందని, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సాంకేతికత వల కొత్త రకమైన వివక్షలకు ఆస్కారం పెరిగిందని నిపుణులు హెచ్చరించారు. ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ఐసిఎంఏసీసీ 2024 ముగింపు కార్యక్రమంలో జపాన్‌లోని డమాస్కస్ సంస్థకు చెందిన డా.అకిహికో సుగియమా ప్రత్యక్షంగానూ, బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మెదడు పరిశోధన కేంద్రం సంచాలకులు డా. కె.వి.ఎస్. హరి అంతర్జాలవేదిక ద్వారానూ పాల్గొన్నారు. పరిశోధకులు నైతికవిలువలకి తగిన ప్రాధాన్యమిస్తూనే తమ పరిశోధనాపత్రాలను వ్రాసి ప్రచురించే ప్రక్రియలో తీసుకోవలసిన జాగ్రత్తలను డా.సుగియామా ఈ సందర్భంగా వివరించగా ఏఐ, మెషీన్ల ర్నింగ్, సెమీ కండక్టర్స్, సస్టైయినబిలిటీ, కమ్యూనికేషన్స్, కంప్యూటింగ్, హెల్త్ కేర్ వంటి వివిధ సాంకేతికలకు సంబంధించిన అప్లికేషన్లు, సాధ్యాసాధ్యాలు, సమస్యలుపరిష్కారాలు, సమగ్రాలోచనా విధానం ఈ సదస్సులో చర్చకు వచ్చాయని డా.కె.వి.ఎస్. హరి నిర్వాహకులను అభినందించారు. ఈ సదస్సులో పాల్గొన్న వివిధ అతిథులకు, నిపుణులకు, నిర్వహణకు ఆర్థిక సాంకేతిక సహకారాన్ని, మానవవనరులను అందించిన ఐఈఈఈ వివిధ విభాగాలకు ఈ సందర్భంగా డా.వై. పద్మశాయి కృతజ్ఞతలు తెలిపారు.

## నేత్రపర్వంగా అయ్యప్ప మహాపడి పూజ



శంషాబాద్‌లోని అయ్యప్ప దేవాలయంలో మహాపడి పూజ నిర్వహించి ఇతర గురుస్వాములతో మధుసూదన్ గురుస్వామి

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** శంషాబాద్‌లో కర్రె మధుసూధన్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ నేత్రపర్వంగా జరిగింది. భక్తుల అయ్యప్ప శరణు ఘోషతో ప్రాంగణం పరిసరాలు మార్మోగాయి. అయ్యప్ప స్వామి మాలధారులు భజనలతో హోరెత్తించారు. మణికంఠుని నామస్మరణతో..రంగురంగుల పూలతో 18 మెట్లను సుందరంగా అలంకరించి పడి వెలిగించారు. అనంతరం హరిహరసుతునికి అభిషేకం నిర్వహించారు. పడి పూజలో చేపట్టిన అభిషేక ఘట్టం కమనీయంగా కొనసాగింది. శుక్రవారం శంషాబాద్ అయ్యప్ప దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయ్యప్ప నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి అభిషేక కార్యక్రమంలో మధుసూదన్ గురుస్వామి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పూజారి మహేష్ గురుస్వామి ఆధ్వర్యంలో అభిషేకం మంత్రోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణం అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది. ఈ సందర్భంగా భక్త సంద్రంలో ముంచిన భజన గీతాలహరి భక్తులను అలరించింది. ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధి అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు కాంగ్రెస్ నాయకులు ఆర్.గణేష్‌గుప్త గురుస్వామి, శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బి.గోపాల్‌యాదవ్, స్థానిక కౌన్సిలర్లు, గురుస్వాములు, భక్తులు హాజరైనారు.

## ఉచిత వైద్య శిబిరం




గాయత్రినగర్‌లోని జెనెక్ట్స్ స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరంలో పరిక్షలు నిర్వహించుకుంటున్న విద్యార్థులు.

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 21, ప్రభాతవార్త**

పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని విధాల మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక కృషిచేయడం జరుగుతుందని పాఠశాల కరస్పాండెంట్ జితేందర్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ జెనెక్ట్స్ పాఠశాలలో లయన్స్ క్లబ్ బంజరాహిల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 5వతరగతి నుంచి 10వ తరగతి వరకు వైద్య పరిక్షలు నిర్వహించి అవసరమయిన వారికి మందులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ బంజారాహిల్స్ అధ్యక్షులు మధురంతాకమ్ కైలాసమ్, సెక్రటరీ సత్యనారాయణ రాజు, కోశాధికారి జల్లు మధుబాబు, మాజీ అధ్యక్షులు చెల్ల వెంకటరావు, నాయకులు సిహెచ్ సత్యనారాయణ, పివి సుబ్బారావు, ఎల్ఐసి కృష్ణ, శ్రీలత, పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రతి విషయంపై అవగాహన కల్గి ఉండాలి

**-బేగంపేట టిటిఐ ఇన్స్‌పెక్టర్ రాంచందర్.**

**బేగంపేట డిశంబరు 21,ప్రభాతవార్త**



సెయింట్ జోన్స్ హైస్కూలులో సైన్స్ ఫెయిర్‌ను సందర్శించి వివరాలు తెల్సుకుంటున్న టీటీఐ ఇన్స్‌పెక్టర్ వి.రాంచందర్.

మనిషి గుండె పనితీరు, ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు, చంద్రయాన్, వ్యవసాయం, ఇలా ఒకటేమిటీ 60రకాలైన అద్భుతమైన సైన్స్, గణిత, ఆంగ్ల తదితర ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. శనివారం బేగంపేట బ్రాహ్మణవాడీ లైన్ నెంబరు 3లోని సెయింట్ జోన్స్ హైస్కూలులో సైన్స్ ఎగ్జిబిషన్ ను ప్రిన్సిపాల్ లక్ష్మీపాఠక్, కరస్పాండెంట్ పవన్‌పాఠక్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎగ్జిబిట్స్ ఎల్ కే జీ, యూకేజీ, ఒకటవ తరగతి నుంచి 10వతరగతి విద్యార్థులంతా ఈ ఎగ్జిబిట్స్‌ను తయారు చేసి వాటి పనితీరును వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన బేగంపేట టీటీఐ ఇన్స్‌పెక్టర్ వి.రాంచందర్ మాట్లాడుతూ చిన్న నాటి నుంచే విధ్యార్థులకు ఇలాంటి ఎగ్జిబిట్స్‌ను నిర్వహించడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. సెయింట్‌జోన్స్ హైస్కూలులో విధ్యార్థులు తయారు చేసిన వివిధ రకాలైన ఎగ్జిబిట్స్ అధ్భుతంగా ఉన్నాయని, వారు దాన్ని వివరించిన తీరు బాగుందన్నారు. ప్రత్యేక అతిధులుగా హాజరైన కె.విజయరామరాజు, అల్తాఫ్‌హుస్సేన్ లు మాట్లాడుతూ ఈ సైన్స్‌ఫెయిర్ సెయింట్ జోన్స్ విద్యార్థినీ, విద్యార్థుల ప్రతిభకు అద్దం పడుతుందన్నారు. కరస్పాండెంట్ లక్ష్మీపాఠక్, పవన్‌పాఠక్‌లు విద్యార్థులను నిత్యం ప్రోత్సహిస్తూ వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా సైన్స్‌ఫెయిర్‌ను ఒదర్శించిన విధ్యార్థుల తల్లి దండ్రులు వారి పిల్లలు చేసిన ప్రాజెక్టులను చూసి మురిసిపోయారు. సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ చూపిన మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిల్చిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు లక్ష్మీపాఠక్, పవన్‌పాఠక్‌లు తెలియజేసారు.

## సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 21, ప్రభాతవార్త**

వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జిటియస్ కాలనీ శ్రీ వీరాజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవస్థానంలో ఈనెల 23సోమవారం శ్రీ సాయిబాబా ఆలయ 17వ వార్షిక మహోత్సవం జరుగనున్నాయి. ఈ వేడుకలకు శ్రీ సాయిబాబా ఆలయాన్ని ఇప్పటికే విద్యుత్ దీపాలంకరణలతో దేదివ్యమానంగా అలంకరించారు. సోమవారం రోజు శ్రీ సాయిబాబాకు విశేష మహాస్వరాభిషేకం, విశేష పూజలు ఉంటాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ గుమ్మడిదల సుధాకర్ తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సాయిబాబా వారి అనుగ్రహాన్ని పొందాలని పేర్కొన్నారు.

## నేడు మానసాదేవి విగ్రహ ప్రతిష్టాపన

**బేగంపేట డిశంబరు 21,ప్రభాతవార్త**

బేగంపేట ప్రకాశంనగర్ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలోని శ్రీభూలక్ష్మీ అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అత్యంత మహిమాన్విత శ్రీమానసాదేవి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం జరుగుతుందని ఈ ఓ వితలయ్య, శ్రీభూలక్ష్మీ అమ్మ వారి ఆలయ నిర్మాణదాత విశాల్ సుధాం తెలియజేసారు. ఈ ప్రతిష్టాపన కార్యక్రమం సుప్రీంకోర్టు న్యాయవాది దిలీప్ సుంకర దంపతుల చేతుల మీదుగా అత్యంత వైభవంగా నిర్వహించనున్నారన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఉదయం గం 11.46నిలకు మానసాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మ వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు సంజీవయ్య పార్క్ వద్ద నిర్వహించిన డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ 2కె రన్‌లో పాల్గొన్న పద్మభూషణ్ ఈశ్వర వరప్రసాద్ రెడ్డి, తెలంగాణ విద్యార్థి సమితి తారక్ గౌడ్, రష్మిక ,హ్యాండ్లూమ్ అంబాసిడర్

## భూభారతిలో అనుభవ కాలం పై పునరాలోచించాలి

**తెలంగాణ గ్రామ పంచాయితీ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

**ముషీరాబాద్, డిసెంబర్ 21, ప్రభాతవార్త:** ధరణిలోని లోపభూష్టాలను అధికమించటానికి భూభారతి చట్టం తేవడాన్ని రైతులందరూ ఆహ్వానిస్తున్నారని, కానీ భూభారతి లో అనుభవ కాలం పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని తెలంగాణ గ్రామ పంచాయితీ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రంలో 75 లక్షల మంది చిన్న సన్నకారు రైతులు ఉన్నారని, వారిలో ఈ అనుభవ కాలమ్ ఒక అభద్రతా భావం కలిగిస్తోందని అన్నారు. దీనివల్ల రైతులు, కౌలు రైతులు మధ్య కోట్లాటలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ధరణి కాలంలో అనుభవ కాలం లేనందున తమ భూమి ఊరిలో, ఉన్నా తాము వేరే ప్రాంతంలో ఉన్నా ధైర్యంగా ఉండేవారని గుర్తు చేశారు. అనుభవ కాలం వల్ల కౌలు కిచ్చే రైతులు నష్ట కష్టాలు ఎదుర్కొనవలసి వస్తుందని, దీనివల్ల భూసేద్యం తగ్గుతుందని, గ్రామాల్లో అశాంతి పెరుగు తుందని కోర్లో కేసులు పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి, భూభారతిలో ఉన్న అనుభవ కాలంను తొలగించాలని కోరారు.

## గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస్ రామానుజం

**చిక్కడపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త:** గణిత శాస్త్రంలో అపార మేధా సంపన్నుడు శ్రీనివాస రామానుజం అని ప్రముఖులు పేర్కొన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసంగీతనాట్య వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా శ్రీనివాస రామానుజం యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి ఆధ్వర్యంలో జరిగింది. కీలక ప్రసంగం చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత ఉన్నత అధికారి త్రినాథరావు మాట్లాడుతూ భారతీయ గణిత శాస్త్రం లోని లోతులను అధ్యయనం చేసి ప్రపంచానికి చాటిన శ్రీనివాస రామానుజం ప్రతి పాదించిన సూత్రాలు గణిత శాస్త్ర వేత్త లకు ఉపయుక్తం అని వివరించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాయకుడు శ్రీధర సుబ్రహ్మణ్యం, గాయని ఆమంత, శంకర ప్రసాద్ పాల్గొన్నారు.

## రైల్వేలో కాంమ్రేడ్ రవీందర్‌కు ఘన సత్కారం

**కంటోన్మెంట్, డిసెంబరు 21 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో సికింద్రాబాద్ డివిజనల్ నుంచి మజ్దూర్ యూనియన్‌కు అత్యధిక ఓట్లు సాధించి నందుకు కృషి చేసిన డివిజనల్ కార్యదర్శి కాంమ్రేడ్ రవిందర్‌ను సికింద్రాబాద్ రైల్ కళారంగ్‌లో జోనల్ ప్రధాన కార్యదర్శి చోడవరపు శంకర్ రావ్, అధ్యక్షులు కాల్వ శ్రీనివాస్‌లతో పాటు మజ్దూర్ యూనియన్ నేతలు ఘనంగా సత్కరించారు.

## బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వండి : ఆర్.కృష్ణయ్య డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, శ్రీనివాస్, నీలం వెంకటేష్ ,నందగోపాల్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 21,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ ఋణాలు ఇవ్వాలని బి.సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కాచిగూడలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వం బిసి బంధు పేరిట కొంత మందికే లక్ష రూపాయల ఋణాలను ఇచ్చిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం బిసి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి చేసి ప్రతి కుటుంబానికి 10 లక్షల సబ్సిడీ ఋణాలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఉన్న 12 కుల ఫెడరేషన్లని కార్పొరేషన్ లు గా మార్చాలని అలాగే కామారెడ్డి లో చెప్పిన విధంగా బిసి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ కంపెనీల వల్ల బీసీల కుల వృత్తులు దెబ్బతిన్నాయని వాటిని పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనంను అందించకపోవడం వల్ల ఇప్పటికే అనేక మంది తీవ్ర అస్వస్థకు గురై ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని కావున గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని ఆ నమ్మకాన్ని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆర్ కృష్ణయ్య కోరారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేపీసీ చైర్మన్ నీల వెంకటేష్, విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ, నందగోపాల్, జిల్లపల్లి అంజి, సతీష్, రాందేవ్ మోదీ పాల్గొన్నారు.

## బాలికలు విద్యాపరంగా అభివృద్ధి చెందాలి




మారేడ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ డే లో పాల్గొన్న మునగ రాంమోహన్, తాటి కొండ పట్టాభి, ప్రిన్సిపాల్ నాగరాణి తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్21 ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియన్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది సమాజాభివృద్ధి కోసం పాటుపడాలని ప్రముఖ వ్యాపార వేత్తలు తాటి కొండ పట్టాభి, మునగ రాంమోహన్‌లు తెలిపారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లి పద్మశాలి కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ డే వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా పట్టాభి ఆధ్వర్యంలో 1400 మంది విద్యార్థినీలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినీలు పలువురిని అలరించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాణి, శంకర్ రెడ్డి, మునగ లక్ష్మి, నర్సింగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

## యేసు క్రీస్తు బోధనలు పాటించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబరు21 ప్రభాతవార్త:** యేసు క్రీస్తూ శాంతి, ప్రేమను పంచడానికి భూమి మీదకు వచ్చారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శనివారం 7వ వార్డు తిరుమలగిరి హోలీ ఫ్యామిలీ బాలికల హై స్కూల్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రతిభకనబర్చాలన్నారు. ప్రతి ఒక్కరు లక్ష్యాన్ని ఎన్నుకొని విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల, థిరిస్సా తదితరులు పాల్గొన్నారు.

## పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే తలసాని



సిఎం.ఆర్.ఎఫ్.చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబరు21 ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సహాయాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మోండా డివిజన్‌కు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సిఎం.ఆర్.ఎఫ్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను శనివారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఆకుల హరిక్రిష్ణ, నాయకులు ప్రమోద్, నందు పాల్గొన్నారు.

## బాధ్యత మర్చిన రాహుల్ గాంధీ : కార్పొరేటర్



రాహుల్‌గాంధీ పోస్టర్ పట్టుకుని నిరసన చేస్తున్న కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

**బేగంబజార్,డిసెంబర్ 21ప్రభాతవార్త:** పార్లమెంట్ సభ్యులుగా కొనసాగుతున్న రాహుల్‌గాంధీ బిజెపిపార్లమెంట్ సభ్యులపై దాడి చేయడం హేయమైన చర్య అని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ అన్నారు.సాక్షాత్తు పార్లమెంట్ భవనం వద్ద బిజెపి పార్లమెంట్‌సభ్యులు దాడి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.జాంబాగ్ వద్ద బిజెపి కార్యకర్తలతో కలిసి రాకేష్ జైస్వాల్ రాహుల్ గాంధీ పోస్టర్ పట్టుకుని నిరసనవ్యక్తం చేశారు. గత 10సంవత్సరాలుగా అధికారంలో లేకపోవడంతో రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నాయకుడికి బాధ్యతమర్చి పార్లమెంట్ సభ్యులపై దాడి చేయడం పట్ల ప్రతి ఒకరు తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## కొత్త భవనం నిర్మాణం చేస్తాం : ఛైర్మన్ ఉపేందర్‌రెడ్డి



గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఈ సంస్థ చైర్మన్ కెసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి,కార్పొరేటర్ సున్నం రాజ్ మోహన్‌లు

**అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 21ప్రభాతవార్త:** నగరంలోని గ్రంథాలయాల అభివృద్ధి కొరకు ప్రత్యేక చర్యలతోపాటు వాటిలో మౌళిక సదుపాయాలను చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కెసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు.శనివారం చైర్మన్ ఉపేందర్‌రెడ్డి,స్థానిక కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్,జిల్లా కార్యదర్శి పద్మజా,సెక్షన్ ఇన్‌చార్జ్ సుకేష్‌కుమార్,గ్రంధపాలకుడు చంద్రశేఖర్ కలిసి దూద్‌బౌలిలోని గ్రంథాలయ నిర్మాణం కొరకు పరిశీలించారు.త్వరలోనే నూతన గ్రంథాయల భవనం నిర్మాణం అంచనాలు రూపొందిస్తామన్నారు.నగర గ్రంథాలయ సంస్థ శాఖ గ్రంథాలయంలో పాఠకులతోపాటు విద్యార్థీ,విద్యార్థులకు చదువుకునేందుకు గాను వీలు ఉంటుందన్నారు.ఈకార్యక్రమంలో సాయికిరణ్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సమాజాభివృద్ధికి పాటుపడాలి : దేవసేన



**అడ్డగుట్ట,డిసెంబరు 21 ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది దేశాభివృద్ధి కోసం పాటుపడాలని సాంకేతిక విద్యా శాఖ కమీషనర్ దేవసేన పిలుపునిచ్చారు. మారేడ్‌పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎలక్ట్రానిక్స్ కళాశాలలో అన్ని హంగులతో నిర్మించిన ఆడిటోరియంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.మన దేశంలో చదివిన విద్యార్థులు విదేశాలకు వెళ్లకుండా పుట్టిన దేశానికే సేవలు అందించాలన్నారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్ళాలి కాని అక్కడ స్థిరపడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ కార్యదర్శి పుల్లయ్య, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ శివార్లలో దొంగల హల్‌చల్

### -పైకప్పు రేకులు కత్తిరించి ఫాల్ సీలింగ్ ధ్వంసం చేసి చోరీకి పాల్పడిన వైనం



పైకప్పు రేకులు కత్తిరించి ఫాల్ సీలింగ్ ధ్వంసం చేసిన దృశ్యం

**సరూర్‌నగర్, డిసెంబరు 21 ప్రభాతవార్త:** హైదరాబాద్ శివార్లలోని ఓ షాపు పైకప్పు రేకులు తొలగించి ఫాల్ సీలింగ్‌ను ధ్వంసం చేసి లోనికి జొరబడిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. సొత్తును దొంగతనం చేసిన నిందితులు ఆధారాలు దొరకకుండా షాపులోని సిసి కెమెరాల వైర్లను కత్తిరించి కొన్ని సిసి కెమెరాలతో పాటు కీలకమైన సిసి ఫుటేజ్ హార్డ్ డిస్క్‌లను సైతం ఎత్తుకెళ్ళారు. ఈ సంఘటన నగర శివార్లలోని ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధి కిందకు వచ్చే నాదర్‌గుల్‌లో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. బడంగ్‌పేట్ శివనారాయణపురంలో నివసిస్తున్న మాల్ మల్లెపల్లికి చెందిన సాయితేజ నాదర్ గుల్‌లోని మర్రి చెట్టు స్మశానవాటిక క్రాస్ రోడ్స్‌లోని మాజీ సర్పంచ్ రామోజీ శ్రీశైలంచారి దుకాణాల సముదాయంలో రెండు మడిగలను అద్దెకు తీసుకొని శ్రీ సాయి వెంకటేశ్వర ట్రేడర్స్ పేరిట హోల్‌సేల్ అండ్ రిటేల్ కిరాణా స్టోర్స్‌ను నడుపుతున్నాడు. అయితే రోజూ మాదిరిగానే శుక్రవారం రాత్రి షాపును మూసి ఇంటికి వెళ్ళిన సాయితేజ శనివారం ఉదయం షాపు తెరిచి చూసే సరికి లోపల ఫాల్ సీలింగ్ ధ్వంసం అయి దానిపై ఉన్న పై కప్పు ఇనుప రేకులు కత్తిరించి ఉండడాన్ని గమనించాడు. దీంతో షాపులో చోరీ జరిగినట్లు గ్రహించి పరిశీలించగా విలువైన సిగరెట్లు డబ్బాలతో పాటు ఇతర సామగ్రి, కొంత నగదు కనిపించలేదు. ఈ మేరకు 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయగా ఆదిభట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధిత షాపు యజమాని నుండి ఫిర్యాదు తీసుకున్న ఆది భట్ల పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భూభారతి చట్టం రెవెన్యూ చరిత్రలో నిలిచిపోతుంది

### -గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్ర రావు

**చిక్కడపల్లి, డిసెంబరు 21 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఆర్ ఓ ఆర్ భూ భారతి చట్టం రెవిన్యూ చరిత్రలో ఒక మైలురాయిగా మిగిలిపోతుందనీ, ఈ చట్టంతోనే రాష్ట్రంలోని 50 లక్షల మంది రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వీఆర్వోల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్ర రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఆర్ ఓ ఆర్ భూ భారతి చట్టాన్ని స్వాగతిస్తూ... ఖమ్మంలో వీఆర్వోల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు ఆధ్వర్యంలో శనివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గరికె ఉపేంద్ర రవు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ధరణి అనే మహమ్మారి వలన సుమారుగా 50 లక్షల మంది భూ బాధితులుగా మారి, ప్రభుత్వ పెట్టుబడి సాయం అందక, తీవ్ర నష్టాన్ని అనుభవిస్తున్నారని అన్నారు. మనోవేదనతో ఉన్న రైతులకు నూతన ఆర్ ఓ ఆర్ 2024 (భూభారతి)తో రైతులకు భూ హక్కులు కల్పించుట లో, భూ సమస్యలు పరిష్కరించుటలో, స్థానికంగానే, సన్న, చిన్న కారు, దళిత,గిరిజన, నిరుపేద రైతులకు అందుబాటులో గ్రామ, మండల, డివిజన్, మరియు జిల్లా స్థాయిల లోనే 80, 90 శాతం పరిష్కారం అయ్యేలా చట్టం రూపొందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి లక్ష్మీ నరసింహులు, షేక్ జానీ మియా, వజ్జా మారావు,ధరావత్ భాస్కర్, నెల్లూరి లవన్ కుమార్, శీలం వెంకటేశ్వర్లు, పద్దం వెంగళరావు, దన్నూరి బాలరాజు, వాంకుడోత్ వెంకన్న, ఆంగోత్ ఉపేందర్, చిన్న వీరభద్రం, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ నివాస్ జర్నలిస్ట్ కాలనీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

**నిజాంపేట్, డిసెంబర్ 21, ప్రభాతవార్త**

నిజాంపేట్ నివాస్ జర్నలిస్ట్ కాలనీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జర్నలిస్ట్ కాలనీ చర్ల ఎల్లమ్మ దేవాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో కాలనీ సభ్యుల అందరి ఆమోదం మేరకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సీనియర్ జర్నలిస్ట్, రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, కాలనీ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ జర్నలిస్ట్ టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు కొలిపాక వెంకట్, కోశాధికారిగా సీనియర్ జర్నలిస్ట్, జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ఒర్సు లింగస్వామి, రాష్ట్ర వ్యవస్థపాక అధ్యక్షుడుగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, సలహాదారులుగా సీనియర్ జర్నలిస్ట్‌లు గుంటూరు శేఖర్, దామర జగదీశ్వర్ గుప్తా, ఉద్దండపురం వెంకటేష్ గౌడ్, సిరిగిరి శ్రీనివాస్, నర్సింహతో పాటుగా నిజాంపేట్ గ్రామ వాసులు టేకుల సుధాకర్ రెడ్డి, జీతయ్య, పెంటయ్యలు ఉన్నారు. అలాగే కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా సీనియర్ జర్నలిస్ట్‌లు ముక్కర్ల లాలయ్య, నాగేంద్ర చారి, ఉపాధ్యక్షులుగా దేవేందర్ గుప్తా, శ్రీనివాస్, రాముయాదవ్, మల్లిఖార్జున్, జాయింట్ సెక్రటరీలుగా కృష్ణ, మారుతి కుమార్, కేవీవీ సత్యనారాయణ, పీ. శ్రీనివాస్ రావు, హబీబ్, ఈసీ మెంబర్స్‌గా గోవింద్ రావు, కే. లక్ష్మణ్, కే. రమేష్, మహేష్, లక్ష్మణ్, మణి, శ్వేతశ్రీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నివాస్ జర్నలిస్ట్ కాలనీ అసోసియేషన్‌కు నూతనంగా భాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



నూతన అసోసియేషన్ సభ్యులు

### గుండె చికిత్సలో ఏఐ పరిజ్ఞానంతో మెరుగైన వైద్య సేవలు

**-హోలిస్టిక్ సిఈఓ హనుమాన్ ప్రసాద్**



నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన ఐవస్ యంత్రంతో డాక్టర్లు, అధికారులు

**గచ్చిబౌలి, డిసెంబరు 21 ప్రభాతవార్త**

ఏఐ ఆధారిత పరిజ్ఞానంతో గుండె చికిత్సల్లో మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ గ్రూప్ సిఈఓ డాక్టర్ హనుమాన్ ప్రసాద్ అన్నారు. కొండాపూర్ మజీద్‌బండలోని హోలిస్టిక్ ఆసుపత్రిలో ఏంజియోగ్రఫీ స్టంటింగ్ చికిత్సలో అత్యాధునిక అవిగో ప్లస్ ఐవస్(ఎవివిఐజిఒ+) ఐవియుఎస్ యంత్రాన్ని ఆసుపత్రి కార్డియాలజీ డాక్టర్లతో కలిసి హనుమాన్‌ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమాన్ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా ఏంజియోగ్రఫీ స్టంటింగ్ చికిత్సలో ఏఐ ఆధారిత సాంకేతికతను తాము ప్రవేశపెట్టామని అన్నారు. హోలిస్టిక్ స్థాపించి 15 సంవత్సరాలు పూర్తవుతుందని, వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం కోసం 15 మంది కార్డియాలజీ డాక్టర్లతో ఈ గ్రూప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శివకుమార్, సుబ్బారావులతో పాటు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో స్పీడ్‌బ్రేకర్స్,సూచిక బోర్డు ఏర్పాటు

(వార్త ప్రభావం)

**-హర్షం వ్యక్తం చేస్తున్న ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ వాసులు**



ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో స్పీడ్ బ్రేకర్స్,సూచిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం.

**బేగంపేట డిశంబరు 21,ప్రభాతవార్త**

బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో మూల మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ఘటనపై ఈ నెల 9వతేదీన ,ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ మలుపులో స్పీడు బ్రేకర్లు,, ఏర్పాటు చేయాలంటూ ప్రభాతవార్త హైదరాబాద్ మినీలో కథనం ప్రచురితమైంది.ఈ కథనంపై స్పందించిన అధికారులు మూల మలుపులో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాలు జరిగే స్థలం,నిదానంగా ప్రయాణించాలని, అప్రమత్తంగా ఉండాలంటూ సూచిక బోర్డును ఏర్పాటు చేసారు.దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అలాగే ఫతేనగర్ లింక్ రోడ్డుపైన కూడా ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.ఈ సందర్భంగా అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేసారు.

## సీనియర్ జర్నలిస్ట్ హష్మిని పరామర్శించిన అయోధ్యరెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:**

సీనియర్ జర్నలిస్ట్ హష్మి కుమార్తె అమ్మారా అఫ్జామ్(24) మృతి చెందిన విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి సిపిఆర్‌వో అయోధ్యరెడ్డి శనివారం హష్మీ నివాసానికి వెళ్లి ఆయన్నీ, ఆయన కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. ఇది చాలా విషాదాకరమైన సంఘటని, ఎంతో భవిష్యత్ ఉన్న అఫ్జామ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఎంతో అందరికి ధైర్యం చెప్పే హష్మీ ఇంట విషాదం చోట చేసుకోవడం చాలా బాధను కలిగిస్తుందని అయోధ్యరెడ్డి అన్నారు. హష్మీని పరామర్శించిన వారిలో జెసిహెచ్‌ఎస్ఎల్ అధ్యక్షుడు బ్రహ్మండభేరి గోపరాజు, సీనియర్ జర్నలిస్టులు పార్థసారథి, ఈశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ ఉన్నారు.

## బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలి : జంపనప్రతాప్

**కంటోన్మెంట్,డిసెంబరు 21 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి డైయిరీ ఫాం వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం శుక్రవారం హైదరాబాద్ జిల్లాకు చెందిన రెవెన్యూ భూసేకరణ,హెచ్ఎండిఏ అధికారులు న్యూ బోయిన్‌పల్లి సంజీవయ్య నగర్ ప్రధాన రోడ్డు మార్గంలో సర్వే నిర్వహించారు. విషయం తెలుసుకున్న కంటో న్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని అధికారులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో స్థలం కోల్పోయిన వారికి తగిన విధంగా నష్టపరిహారం చెల్లించడంతో పాటు వారికి ప్రత్యామ్నాయంగాస్థలం కెటాయించి ఇండ్లు కట్టించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డుకు ఇరువైపులా దాదాపు 120 ఇండ్లు కోల్పోతున్నారని వారి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాజేశం, బస్తీ పెద్దలు డి.ఎం.అశోక్, యాదవరావ్, దీరథ్, శ్యామ్, వరప్రసాద్, రాజు పాల్గొన్నారు.

## అమరవీరుల స్థూపం కూల్చివేసి ఆసుపత్రి నిర్మాణం చేపడతారా?

**గోషామహల్,డిసెంబర్ 21 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లోతలపెట్టిన నూతన ఆసుపత్రి నిర్మాణం వెనక్కి తీసుకోవాలని కోరుతూ గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్,ఉద్యమ నాయకులు బిఆర్ఎస్ నాయకులు బెజ్జిని శ్రీనివాస్,గోపియాదవ్‌లు డిమాండ్ చేశారు.గోషామహల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూచారిత్రాత్మకమైనశివకుమార్‌లాల్ స్టేడియంలో పోలీసు అమరవీరుల స్థూపాన్ని కూల్చివేసి ఆసుపత్రిన్ని నిర్మిస్తావా ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.ఆసుపత్రి కొత్త భవనాన్ని వేరే ప్రాంతంలో నిర్మించాలన్నారు.జన నివాసాల మధ్యఆసుపత్రి నిర్మించడం మూలంగా ప్రజలకు అనేక సమస్యలు ఎదుర్యే పరిస్థితి వస్తుందన్నారు.ఇరు రోడ్లు,ట్రాన్స్‌పోర్టులు,ప్రతియేటా జరిగే ఎగ్జిబిషన్‌మైదానం ట్రాఫిక్‌తో అనేక ఇక్కట్లకు గురుఅవుతారన్నారు.లేని పక్షంలో స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఉస్మానియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న స్థలంలోనే ఆసుపత్రిన్ని నిర్మించాలని సూచించారు.అసలు పోలీసు అధికారుల సంఘం ఎందుకు అడుగడం లేదని వారు ఆశ్చర్యపోతున్నామన్నారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన టిఎన్‌జిఓ క్రీడా పోటీలు

**గన్‌ఫౌండ్రి,డిసెంబర్ 21ప్రభాతవార్త:** తెలంగాణ నాన్ గజిటెడ్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో స్వామినాథన్ క్రికెట్ మెమోరియల్ టోర్నమెంట్‌లో భాగంగా శనివారం పురుషులకు షాట్‌పుట్,జావీలైన్‌త్రో,రిన్నింగ్,వాలీబాల్,కబడ్డి పోటీలను నిర్వహించారు .సెమీఫైనల్ పోటిలో సివిల్‌సప్లయిస్ జట్టుపై యూత్‌ఫోర్స్ జట్టువిజయం సాధించింది.ఫైనల్స్‌లో సెంట్రల్ లైబ్రరీపై విజయ దంకా మోగించి 11వ స్వామి నాథం మెమోరియల్‌ట్రోఫిని స్వాధీనం చేసుకున్నారు.గత నాలుగు రోజులుగా సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ పర్యవేక్షణలో కొనసాగాయి.ఈపోటిలను జిల్లా అధ్యక్షులువిక్రమ్‌కుమార్,కోశాధికారి సయ్యద్ అసదుద్దీన్,కార్యానిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్,కేంద్ర క్రీడా కార్యదర్శి బి.శంకర్,ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్,ఖాలీద్‌అహ్మద్,ముఖీమ్‌ఖురేషీ,ఇఎన్‌టి రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.పురుషులకు ఆట పోటిలను నిర్వహించారు.

## గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు..

**నిజాంపేట్, డిసెంబర్ 21, ప్రభాతవార్త**

నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు మ్యాథ్స్ మేళా నిర్వహించారు. మొదటిగా విద్యార్థులు గణిత శాస్త్రనికి సంబంధించిన వివిధ పరికరాలను తయారు చేసి మేళాలో ప్రదర్శించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే గణితంపై ఆసక్తి కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థి దశ నుంచే గణితంపై దృష్టి సారించి బాలమేధావులుగా ఎదగాలని కోరారు. గణిత శాస్త్రం మానవ, సామాజిక అభివృద్ధిలో ఎంతో ప్రాముఖ్యత కలదని, గణితం లేకుండా మానవ ప్రగతిని, అభివృద్ధిని ఊహించలేమని అన్నారు. విద్యార్థినులు తయారు చేసిన నృత్యాలను తిలకించి, అనంతరం క్విజ్, రంగోలి, గణిత నమూనాలా ప్రదర్శన వంటి నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు రఘునాథ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




హోటల్ తాజ్ డెక్కన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ,డాక్టర్ లక్ష్మణ్,ఈటల రాజేందర్,రఘునందన్ రావులు ప్రైడ్ ఆఫ్ నేషన్ 2024 అవార్డును గ్రహీతలకు ఇచ్చి సత్కరింస్తున్న దృశ్యం

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
టెండర్ ప్రకటన 'ఇ' నిట్ నెం: 05/IT/GHMC/2024-25, 1వ పిలుపు, తేది: 19.12.2024
పనిపేరు : GHMC కేంద్రకార్యాలయం యొక్క వివిధ సెక్షన్‌లకు ప్రింటర్స్‌కు కార్ట్రిజ్‌లు, మల్టీ-ఫంక్షనల్ కలర్ ప్రింటర్స్ మరియు కాపియర్ మెషీన్‌లు రేట్ కాంట్రాక్ట్‌పై (1) సంవత్సరానికి సరఫరా, కోట్స్ దాఖలుకు ప్రారంభ, చివరి తేదీలు, సమయం : ప్రారంభ తేదీ: 23.12.2024 ఉ.11.00గం. ముగింపు తేది: 30.12.2024 సా.5.00గం. అధికారి పేరు, చిరునామా సెల్ నం: అడిషనల్ కమిషనర్ (IT) కార్యాలయం, 3వ అంతస్తు, సిసి కాంప్లెక్స్ బిల్డింగ్, GHMC, లిబర్టీ సర్కిల్, హైదరాబాద్-500063 ఫోన్ : 6309999458/9963551523 deeit-ghmc@gov.in.
సం/-. అడిషనల్ కమిషనర్, (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) GHMC.
DIPR.NO. 8192-PP/CL/ADVT/1/2024-25 తేది: 21.12.2024

CLASSIFIEDS

LOSS OF DOCUMENTS

★ I, KALLU LOHITH REDDY S/o. K.SATYANARAYANA REDDY R/o. H.No.5-4-1597/A, Sarada Nagar, Vanasthali Puram, R.R.Dist, T.S. I Have Lost My Original Sale Deed Documents Bearing Nos. 829/2024 & 693/2024 And My Mother's Signed Empty Bond Papes, Promissory Notes & Cheques. If any transactions done with the said documents, the transactions are not valid and not binding on us and it is liable for prosecution. If Anyone Found Plz Cont: 9704576422.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

PUBLIC NOTICE

The General public is hereby informed that our client Shriram Finance Limited Pochampally Branch, Yadadri Blnivanagiri Dist is dealing with financing business in the course of business **Smt. Ramavath Suguna, W/o. R.Pandu,** approached our client for finance and accepted to deposit her title deeds in respct of her property i.e., All that the piece and parcel of Open Plot No.201 Eastern Part, in Survey No.50, 51, 52, 53 & 54 (Part), admeasuring 100 Sq.yards or 83.6 Sq. mtrs, (Out of 200 Sq.yards), Situated at V.S.T. Colony, Medipally Village, under Peerzadiguda Municipal Corporation, Medipally Rev Mandal, Medchal Malkajgiri District and Bounded as follows:-
NORTH: PLOT NO. 185, SOUTH: 25' WIDE ROAD, EAST: PLOT NO.200 , WEST: PLOT NO.201 WESTERN PART , towards security for the loan availed by her. If any person or persons having any claim, right, title or interest in the above said property may approach the undersigned within 7 days from the date of this publication or else our clinet will proceed with the transaction.
**S.SRINIVAS RAO, A.SUPRIYA,** Advocates,
H.No.2-19-79/A/10/A, Balaji Enclave Extn, East Kalyanpur, Uppal, Hyderabad - 500 039
**Cell : 9948104019**

NOTICE

IN THE COURT OF THE II ADDL DISTRICT AND SESSIONS JUDGE Medchal Malkajgir District At Medchal.
**IA No.172 of 20**
**IN**
**OS 69 OF 23**
BETWEEN
P.Bhanu Kumar
Petitioner/Defendant No. 3
AND
M.Shivaji and others
Respondents/Plaintiffs/ Defendants
TO:
K.Kumar s/o K.Rambabu
Age 62 years, Occ. Business, Bachupally, Bachupally Mandal, Medchal Malkajgiri District.
Respondent No. 9
Take notice that the above IA is filed by the Petitioner and the same is posted for your notice, Counter if any and disposal on 30-12-2024. Therefore, you are required to appear on 30-12-2024 at 10.30 AM in the above designated court either in person or through an Advocate duly instructed, and in default, the matter will be heard and decided in your absence.
[ BY ORDER OF THE HON'BLE COURT ]
**G. Suvarna Kumari** Advocate
Sri Sai towers, Hydernagar, Kukatpally, Hyderabad 500 085
Date: 20-12-2024
Hyderabad.

CAUTION PUBLIC NOTICE TO WHOMSOEVER CONCERN

This is to inform all the residents of SAKET RESIDENTS WELFARE ASSOCIATION (SRWA), Phase-II, Saket, Hyderabad,General public and to whomsoever concern that SRWA is a Registered Association vide 1/2011 with Registrar of Societies under the AP PSR Act, 1350 Fasli ( Act1 of 150 F).
This is to inform that all the registered members of the SRWA are binded by the By-Laws of the Association and further the present Elected Committee members came to know that the some residents of SRWA are trying to form a new Association illegally without the knowledge of the present Executive Committee and members of the society,which is null and void.The present Executive committee immediately gave a written representation to the Registrar of Societies not to entertain the same, as there are case pending before the Hon'ble Courts at Kushaigud vide S.O.P No.4/2023, S.O.P.No 2/2024 and O.S.No 269/2024.
This Notice is being issued to caution the Resident members of SRWA, General Public and to Whomsoever concern in vicinity whoever comes across this information please be cautioned not to entertain or involve in such type of association and please inform the same to the present Executive Committee so that the committee may take appropriate legal steps in the interest of the welfare of the society members.
**B.N.PAVAN KUMAR**
**N.SAI HARI TEJ**
**Advocates**
Plot No.19, S.V.Nagar Colony, J.J.Nagar Colony (P),Yapral, Secunderabad -500087
**M.No.8897999007**

NOTICE

IN THE COURT OF THE II ADDL DISTRICT AND SESSIONS JUDGE Medchal Malkajgir District At Medchal.
**IA No.171 of 20**
**IN**
**OS 107 OF 02**
BETWEEN
P.Bhanu Kumar
Petitioner/Defendant No. 3
AND
M.Shivaji and others
Respondents/Plaintiffs/ Defendants
TO:
P.Raghu s/o P.Sathaiah,
Age 53 years, Occ Business,
R/o Flat No 302, Sunder Sai Plaza, Naveen Nagar, Hyderabad.
Respondent No. 9
Take notice that the above IA is filed by the Petitioner and the same is posted for your notice, Counter if any and disposal on 30-12-2024. Therefore, you are required to appear on 30-12-2024 at 10.30 AM in the above designated court either in person or through an Advocate duly instructed, and in default, the matter will be heard and decided in your absence.
[ BY ORDER OF THE HON'BLE COURT ]
**G. Suvarna Kumari** Advocate
Sri Sai towers, Hydernagar, Kukatpally, Hyderabad 500 085
Date: 20-12-2024
Hyderabad.

NOTICE

IN THE COURT OF THE II ADDL DISTRICT AND SESSIONS JUDGE Medchal Malkajgir District At Medchal.
**I.A. No. 1039 of 2022**
**IN**
**O.S.No. 107 OF 02**
BETWEEN
P.Bhanu Kumar
Petitioner/Defendant No. 3
AND
M.Shivaji and others
Respondents/Plaintiffs/ Defendants
TO:
S. Balaiah alias S.Balesh s/o S. Lingaiah aged about 47years, Occupation: Agriculture, R/o Bachupally Village, Bachupally Mandal, Medchal Malkajgiri District
Respondent No. 38
Take notice that the above IA is filed by the Petitioner and the same is posted for your notice, Counter if any and disposal on 30-12-2024. Therefore, you are required to appear on 30-12-2024 at 10.30 AM in the above designated court either in person or through an Advocate duly instructed, and in default, the matter will be heard and decided in your absence.
[ BY ORDER OF THE HON'BLE COURT ]
**G. Suvarna Kumari** Advocate
Sri Sai towers, Hydernagar, Kukatpally, Hyderabad 500 085
Date: 20-12-2024
Hyderabad.

NOTICE

IN THE COURT OF THE II ADDL DISTRICT AND SESSIONS JUDGE Medchal Malkajgir District At Medchal.
**IA No.174 of 20**
**IN**
**O.S.No. 69 OF 23**
BETWEEN
P.Bhanu Kumar
Petitioner/Defendant No. 3
AND
M.Shivaji and others
Respondents/Plaintiffs/ Defendants
TO:
M/s Meghana Travels, rep by Not known, R/o Bachupally Village, Bachupally Mandal, Medchal Malkajgiri District
M/s Anjana Travels, Rep by Not known, R/o Bachupally Village, Bachupally Mandal, Medchal Malkajgiri District
M/s Satkartar Rep by Not Known R/o Bachupally Village, Bachupally Mandal, Medchal Malkajgiri District.
Respondents Nos. 10 to 12
Take notice that the above IA is filed by the Petitioner and the same is posted for your notice, Counter if any and disposal on 30-12-2024. Therefore, you are required to appear on 30-12-2024 at 10.30 AM in the above designated court either in person or through an Advocate duly instructed, and in default, the matter will be heard and decided in your absence.
[ BY ORDER OF THE HON'BLE COURT ]
**G. Suvarna Kumari** Advocate
Sri Sai towers, Hydernagar, Kukatpally, Hyderabad 500 085
Date: 20-12-2024
Hyderabad.

PUBLIC NOTICE

The general public are hereby informed that **Mr. Mirza Athar Ali, S/o. Mirza Azam Ali** has approached M/s Shriram Finance Ltd, Chikadpally Branch, Hyderabad for depositing his title deed vide **Registered Gift Settlement Deed Vide Doct-No. 4818 of 2024, dated 11-06-2024,** by way of equitable mortgage in respect of schedule property for securing their future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within **(7) Seven days** from today, failing which the loan amount will be sanctioned to **Mr Mirza Athar Ali, S/o. Mirza Azam Ali** and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.
**SCHEDULE OF THE PROPERTY**
All that the Plot No.471, in Sy.Nos. 99 & 105, admeasuring an area of 333.00 Sq.Yds.,or equivalent to 278.38 Sq.Mts., situated at "Sai Bhavani", Budvel Village, Under GHMC Rajendranagar Circle, Ranga Reddy District, Telangana State, bounded by. NORTH: Plot No.464, SOUTH: 40' Wide Road, EAST: Plot No.470, WEST: Plot No.472
**For Nomos Vistas, The Lawyers, Govardhan Venu, Advocate & CEO**
# Shiva Shakti, H.No. 8-2-684/3, Plot no 80, Road No. 12, Near GHMC Ward Office, Ministers Colony, Banjara Green Colony, Hyderabad, Telangana 500034, Mob: - +91-9849091266
Dt: 20-12-2024

IN THE COURT OF THE III ADDL.CHIEF JUDGE CITY CIVIL COURT, HYDERABAD
**O.S.No. 557 OF 2024**
**Between :**
Smt. Perumalla Shyamala and others ...**Plaintiffs**
**AND**
The Thasildar Saidabad, and others ... **Defendants**
**To,**
1) The Thasildar, Saidabad, Saidabad Mandal, Opp : Rose Garden Function Hall, Sagar Road, Hydrabad, 500059.
2) Canara Bank, SPSID, Mid -coprora tion Bank, Sultan Bazar, Hyderabad.
3) **All Concered**
Please take notice that the above Plaintiffs have filed the above case on the file of Hon'ble III ADDL. Chief Judge, City Civil Court, Hyderabad against the Defendants. The above case is posted for the Appearance of the Defendants on 27-01-2025 at 10:30 AM, for the relief of declaration of legal heirs of Late Perumalla Madhusudan Reddy and declare the plaintiffs as owners of the property with respect to below mentioned schedule property for your appearance before the Hon'ble Court in person or through your counsel, failing which the case will be proceed further and it will be decided on merits in your absence.
**SCHEDULE PROPERTY**
All that part and parcel of the house property bearing municipal No. 17-1-388/P/69, constructed in the approved layout Plot No. 69, forming part of Sy. No. 202 to 205, admeasuring 314 square yards, or 262.50 square meters, situated at Poornoday Colony, Saidabad, Hyderabad under Saidabad Mandal, under the jurisdiction of Azamapur Sub Registrar, Hyderabad, and bounded as follows : **North :** 40 feet wide road :: **South :** Land of I.S. Sadan **East :** House in plot No. 68 and 70 :: **West :** Neighbours house and land
**By the Order of the Court**
Sd/-., **P. Amarender Reddy, A. Chakravarthy**
(Advocates)
R/o 17-1-388/P/91, Laxmi Nagar Colony, Saidabad, Hyderabad-500059
**Cell : 9246501212**

